క్లుప్తంగా

సిపాయి భరోసా అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాగాలి గ్రామానికి చెందిన మామండూరు మునిరెడ్డి(57) ఇటీవల మృతిచెందాడు. గురువారం తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గ్రామానికి వెళ్లి తమ ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మాజీ డాక్టర్ బాబు, వెంకటేష్, మురగారెడ్డి, మునిచంద్ర, చలపతి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



ఆర్థికసాయం ఇస్తున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పూడి దళితవాడకు చెందిన వెంకటేశ్వర్లు గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించడానికి కుటుంసభ్యులను పంపారు. అనంతరం దహనక్రియలకు రూ.10 వేలను వారికి అందజేశారు.

శానిటరీ కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోగురువారం రెడ్‌క్రాస్ సౌజన్యంతో శ్రీకాళహస్తి పురపాలక సంఘ పారిశుధ్య సిబ్బంది 200మందికి శానిటరీ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి డాక్టర్ వెంకట్రామన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండుగారి కృష్ణకుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు మ్యాగీక్లారా, కండ్రిగ ఉమ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఐసీడీఎస్ రేణిగుంట ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని గురువారం రేణిగుంట సీడీపీఓ ఏ.కృష్ణమంజరి తెలిపారు.

ఖాళీల వివరాలు:

1. అంగన్‌వాడీ కార్యకర్త- ఏర్పేడు మండలం పంగూరు(ఓసీ)
2. మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీలు- రేణిగుంట మండలం సుబ్బయ్యగుంట(ఎస్సీ), వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ(ఎస్టీ), ఏర్పేడు మండలం పాయల్‌సెంటర్ (ఎస్టీ).
3. అంగన్‌వాడీ సహాయకురాలు: రేణిగుంట మండలం గాజులమండ్యం(ఓసీ), ఎల్లమండ్యం (ఎస్సీ), ఏర్పేడు(ఓసీ), పెనుమల్లం(ఓసీ). 10వ తరగతి ఉత్తీర్ణులై, 21-35 మధ్య వయస్సు కలిగిన ఆయా గ్రామాల్లో స్థానికులైన వివాహితులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5.30లోపల రేణిగుంటలోని ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా చేర్చాలన్నారు. వివరాలకు 9701554149 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

అభయక్షేత్రంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత

రేణిగుంట: రేణిగుంట బిస్మిల్లానగర్‌లోని అభయక్షేత్రంలో గురువారం దాతలు అన్నదానం చేశారు. తిరుపతి కొరమేనుగుంటకు చెందిన పేరూరు రాజేశ్వరి అభయక్షేత్రానికి చేరుకుని 200మంది దివ్యాంగులు, అనాథలకు అన్నదానం చేశారు. అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరి వీధిలో వెలసిన వరసిద్ధి వినాయకస్వామి, ఆదిదంపతుల ఆలయం వద్ద గురువారం శ్రావణ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. హిందూ ధర్మప్రచార మండలి జిల్లా సభ్యుడు పోతుల రాజకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, పనల కృష్ణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారులదే కీలకపాత్ర

- పెండింగ్ బిల్లులను త్వరితగతిన పరిష్కరిస్తాం
- జెడ్పీ సీఈఓ



పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

కేవీబీపురం: ప్రభుత్వ అభివృద్ధిలో అధికారులదే కీలకపాత్ర అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మించనున్న పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే, జిల్లా జెడ్పీ సీఈఓ గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కేవీబీపురం మండలంలోని సీసీరోడ్ల నిర్మాణాలు, సచివాలయాలు, ప్రైమరీహెల్త్ సెంటర్లు, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, వాటి వినియోగంపై వివరాలు తెలియజేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఇప్పటివరకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందుకు జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పూర్తి సహకారం అందించారన్నారు. మండల కేంద్రంలో రూ.15లక్షలతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణాలను త్వరగతిన పూర్తిచేయాలని, పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచిస్తూ గతంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నేతలు నందకుమార్, లాలుబాబుయాదవ్, మూర్తి సుబ్బయ్య, శాస్త్రిరాజు, ఎంఈఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీటీసీ అయ్యప్ప, సర్పంచ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పూర్తయిన సచివాలయ నిర్మాణ పనులు



చియ్యవరంలో నిర్మించిన సచివాలయం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని చియ్యవరంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.40 లక్షలతో అధునాతన హంగులతో రెండంతస్తుల భవనం నిర్మించారు. అలాగే పనులు పూర్తికావడంతో త్వరలోనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా భవనం ప్రారంభం కానుంది. చియ్యవరం మేజర్ పంచాయతీ కావడంతో సచివాలయం పక్కనే రూ.20 లక్షలతో రైతు భరోసా కేంద్రం కూడా కొత్తగా నిర్మించారు. పనులు పూర్తికావడంతో రైతులకు ఉపయోగపడే విధంగా ఎరువులు అందిస్తున్నారు. సచివాలయం ముందు స్థలంలో పూల మొక్కలతో అందమైన గార్డెన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వైద్యానికి రూ.4.85 లక్షల ఆర్థిక సాయం



ఎల్ఓసీ ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: చిన్నారి ఆశ వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి ముందస్తుగా రూ.4.85 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. కొండలచెరువుకు చెందిన కృష్ణారెడ్డి కుమార్తె ఆశ పుట్టుకతోనే చెవిటి, మూగ. ఆశకు ఆపరేషన్ చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) మంజూరు చేయించినట్లు ఆదిమూలం తెలిపారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో రూ 4.85 లక్షల వరకు వైద్యసేవలను పొందవచ్చునని ఆయన తెలిపారు. ఆశ తండ్రి కృష్ణారెడ్డికి ఎల్ఓసీ అందజేసిన కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని భాషలకు తల్లి సంస్కృతమే



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ప్రపంచంలోని అన్ని భాషలకు సంస్కృతం తల్లివంటిదని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల సంస్కృత అధ్యాపకుడు కోటీశ్వరయ్య తెలిపారు. కళాశాలలో గురువారం సంస్కృత భాషాదినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున సంస్కృత భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రపంచ భాషల్లో సంస్కృతం ప్రాచీనమైనదని, అతి మధురమైన భాష అని కొనియాడారు. వేదానికి ఓంకారం, మానవజన్మకు మాతృమూర్తి లాగానే భారతీయులకు సంస్కృతం అంతే ప్రధానమైనదన్నారు. పాశ్చాత్య దేశాలు ప్రస్తుతం సంస్కృతం వైపు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. భారతీయులందరూ సంస్కృత విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి బహుమతులు, పుస్తకాలు అందజేశారు.

ఘనంగా సంస్కృత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా ప్రపంచ సంస్కృత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ పద్మమాలిని మాట్లాడుతూ ప్రాచీన భారతీయ భాషపై అవగాహన, ప్రచారం, పునరుద్ధరణ కోసం ఈ వేడుకలను నిర్వహిస్తారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా సంచార జాతుల విముక్తి దినోత్సవం



హాజరైన నేతలు

తిరుపతి కల్చరల్: అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో గురువారం యూత్ హాస్టల్‌లో అఖిల భారత 71వ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు అన్నారెడ్డి వెంకట్ మాట్లాడుతూ 1871లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం సంచార జాతులపై క్రిమినల్ యాక్ట్‌ను తీసుకువచ్చిందన్నారు. దాని నుంచి సంచారజాతులకు 1952 ఆగస్టు 31న విముక్తి లభించిందన్నారు. అణగారిన సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ సాహోడ్, కార్యవర్గ సభ్యులు ఆర్.డోలాకృష్ణ, చిత్తరంజన్, జిల్లా నాయకులు పగడాల ప్రసాద్, గంగాధరం, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలో గురువారం శ్రావణ పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అలాగే శింగిరికోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ధన్వంతరి, లక్ష్మీ హోమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ ట్రస్టీ అన్నప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కైలాస నాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమంలో పౌర్ణమి పూజలు చేశారు.

7న ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈ నెల 7న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. టీటీడీ హిందువుల ముఖ్యమైన పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఇందులో భాగంగా శ్రీకృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది సందర్శకులు గోశాలలో గోమాతలకు బెల్లం, బియ్యం స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామికి అభిషేకం, వేణుగానం వేద పఠనం, దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ గానం నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



ఏపీఓ దేవరికి సన్మానం



వెంకటేశ్వర్లుకు సన్మానం

ఏర్పేడు: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గీత ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖల్లోని సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ పల్లం, పంగూరు, మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైస్ ఎంపీపీ జమ్మళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాత్రిళ్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎస్పీడీసీఎల్ అధికారులకు విన్నవించారు. గృహనిర్మాణంలో స్వంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తమ సేవలు అందించిన ఏపీఓ దేవరి, ఏర్పేడు బీసీ హాస్టల్ వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, ఎంపీడీఓ గిడ్డయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

తిరుపతి అర్బన్: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గొడపేరు చిట్టిబాబు తెలిపారు. ఆయన గురువారం తిరుపతిలోని సుభాష్‌నగర్‌లో ఉన్న తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్ రాయ్ ఉత్తర్వుల మేరకు కమిషన్‌లో ఆరుగురికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా బి.బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శులుగా ఏ మునికృష్ణ, కే.దేవరాజులు, ఏ.మోహనరూప, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డీఎం చంద్రకళను నియమించినట్లు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన వారు ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ బి.సర్వేందర్, మెహతాబ్ రాయ్, చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

- జెడ్పీ సీఈఓను కోరిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు విరివిగా నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని కోరారు. గురువారం మధ్యాహ్నం పిచ్చాటూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఎమ్మెల్యే, జెడ్పీ సీఈఓను కలిశారు. ఆ సమయంలో ఈ మేరకు పనుల జాబితాతో వినతి పత్రాన్ని ఎమ్మెల్యే జెడ్పీ సీఈఓకు అందజేశారు. మండలాలకు కేటాయించే నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని అక్కడే ఉన్న ఎంపీడీఓ శ్రీనివాసులుకు సూచించారు. జెడ్పీ నిధులను ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. పనులకు ప్రతిపాదనలు పంపితే తప్పక మంజూరు చేయిస్తానని సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఎంపీడీఓ శ్రీనివాసులుకు తెలిపారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, నాగలాపురం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌నాయుడు, కేవీబీ పురం మండలాల పార్టీ కన్వీనర్‌లు అపరంజిరాజు, గవర్ల క్రిష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దామోదర్‌నాయుడు, ఏఈ హేమాద్రి, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్, పయణి, నేతలు మోహన్, చలపతిరాజు, సుబ్రమణ్యం, మోహన్‌రెడ్డి, ఆనంద్, ఆర్ముగంరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మొక్కలను అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. గురువారం మొదటి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులక ఇండక్షన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ లోకేష్ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలను అందజేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, గంగారాం, పరంధామయ్య, మునెయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ట్యాంకర్లలో తాగునీటి సరఫరా

రేణిగుంట: రేణిగుంటలో మంచినీటి సమస్యను పంచాయతీ పాలకులు తీర్చారు. పట్టణానికి నీరు అందించే తెలుగుగంగ పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో వారం రోజులుగా పట్టణంలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో విషయాన్ని సర్పంచ్ నగేషం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు 7ట్యాంకర్ల ద్వారా రేణిగుంట పట్టణంలోని పలు వీధుల్లో గురువారం తాగునీటిని సరఫరా చేశారు. తాగునీటి సమస్య లేకుండా చూస్తామని, అవసరమైతే మరిన్ని ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తామని సర్పంచ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

- మండల మీట్‌లో సభ్యుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేఖ

పిచ్చాటూరు: పిచ్చాటూరు-శ్రీరామాపురం ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆర్టీసీ అధికారులను కోరారు. గురువారం ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హెచ్ రేఖ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంటే విద్యుత్ శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై రామగిరి, అప్పంబట్టు సభ్యులు సతీష్, రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ఎస్ఎస్‌బీ పేటకు వస్తున్నారని అదే పంచాయతీకి చెందిన బంగారునాయుడు కండ్రిగలో కూడా శిబిరం నిర్వహించాలని సర్పంచ్ మనోహర్ కోరారు. కారూరులో తాగునీటికి డైరెక్ట్ పంపింగ్ వల్ల మిట్ట ప్రాంతాల్లో నీరు అందడం లేదని, తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. తమ గ్రామంలో పాడుబడే స్థితిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు వేలు విన్నవించారు. ఎస్ఎస్‌బీ పేటలో తమిళ ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉందని, దీనివల్ల హనుమంతాపురంలోని తెలుగు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. అనంతరం శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు అడిగిన ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ, తాగునీటి ఇబ్బంది వంటి న్యాయమైన సమస్యలకు తప్పక పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉజ్వల కనెక్షన్లు మంజూరు చేయాలి



డీటీ రవిచంద్రకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

సత్యవేడు: మండల పరిధిలోని శ్రీసిటీ గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. గురువారం శ్రీసిటీ పరిధిలోని చెరివి, ఆరూరు, మల్లవారిపాళెం ఈస్టు, మల్లవారిపాళెం వెస్టు పంచాయతీ సర్పంచులు సన్యాసయ్య, పరంధాం, కమల్, సంజయ్, పార్వతి కలిసి డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.